కథ

# చీర

-అంగర వెంకట శివప్రసాదరావు

వీధి తలుపెవరో విపరీతంగా బాదేస్తున్నారు. అప్పుడు నేను గంజి వారుస్తున్నాను. నాకు గంజి ఎంతో అవసరం. నావన్నీ కాటన్ చీరలే.

**'వస్తున్నా' కేక పెట్టాను.**

**కొంతసేపు తలుపు బాదడం ఆగింది. మళ్ళీ కొంతసేపటికి మళ్లీ మొదలైంది తలుపు బాదడం.**

**గంజి వార్చడం పూర్తయ్యింది. లేచి వెళ్లి తలుపు తీసాను. సుడిగాలిలా ఓ స్త్రీ లోపలికి దూసుకొచ్చింది.**

**ఆమె ఎవరో నాకు తెలీదు.**


**'బుజ్జి లేదా?' అంటూ యిల్లంతా కలయ చూసింది.**

**'బుజ్జి' మా ఆయన ముద్దుపేరు. ఆయన తరపు వాళ్లంతా ఆయన్ని అలాగే పిలుస్తారు. బహుశా ఈవిడ మా ఆయన చుట్టం అయి వుంటుంది.**

**ఈవిడ మాపెళ్లికి వచ్చినట్లు లేదు.**

**'మీ పెళ్లికి నేను రాలేదు' అదే మాట ఆవిడ కూడా అంది.**

**'నీకో జోకు తెలుసా! అసలు మావాళ్లంతా నన్ను బుజ్జికిచ్చి చేద్దామనే అనుకున్నారు.' నవ్వుతూ తనే అంది.**



గదంతా కలయ తిరిగింది. కూర్చోడానికి కుర్చీ కూడా లేదు మాయింట్లో.

మా యిల్లంతా ఆ గదే. ఓ మూల వంటిల్లు. ఓ మూల చాప పరిచి వుంది. నా ట్రంకు పెట్టి బర్రున లాగి దాని మీద చనువుగా కూర్చుంది ఆమె.

'మంచి నీళ్లు కావాలా?' అడిగాను నేను.

'వద్దు కాస్త కాఫీ పెట్టు' అంది.

'పాల్లేవు' అన్నాను నేను సిగ్గుపడుతూ.

'పోన్లే.... మీ ఆయనేం సంపాదించడం లేదా...' గదంతా మరోమారు కలయ చూస్తూ అంది.

నా కర్థం కాలేదు ఆ మాటకి అర్థం. మౌనంగా వున్నాను నేను.

'ఆఫీసుకి వెళ్లాడా బుజ్జి?' అడిగింది ఆమె.

'క్యాంపుకి వెళ్లారు' అన్నాను నేను.

'అదే... ఆఫీసులో కనబడ లేదు. నేను అక్కడ్నించే వస్తున్నాను. ఒళ్లంతా చిరాగ్గా వుంది స్నానం చేస్తాను' అంది ఆమె.

ఆమె చేతిలో సంచీగానీ ఏదీ లేదు. తువ్వాలు అందించాను. బాత్రూమ్ లోకి నడిచింది.

నీళ్ల చప్పుడు వినిపిస్తోంది. కూర వేపుడు చేసాను. కంది పచ్చడి రుబ్బి వుంది. చారు కాచాను. ఆయన ఎప్పుడు వస్తారో తెలీదు. నాకు మాత్రమే వండుకున్నాను.

బాత్రూమ్ లోంచి తువ్వాలు కట్టుకుని బైటికి వచ్చింది.

'నీ చీరేమైనా వుందా...? నా చీర మూడ్రోజుల్నించి నలిగి పోయింది. దొంగ సచ్చినోడు మూడ్రోజులు ఆ బంగ్లాలో వుంచేసాడు. మరో చీర కూడా తెచ్చుకోలేదు. వొళ్లంతా నొప్పులుగా వుంది.'

ట్రంకు పెట్టె లోంచి చీరలు బైటికి తీసాను. అందులో వున్నవి మూడే. ఒంటి మీదున్న దాంతో నాకున్నవి నాలుగే చీరలు.

ఏ చీర యివ్వాలో అర్థం కాలేదు. అన్నీ నాసిరకం చీరలే. ఆవిడ కట్టి విడిచిన చీర చాలా ఖరీదు వుంటుంది. నా వన్నీ వంద, నూట యాభైయ్యే.

ఉన్నవాటిలోంచి మంచి చీర తీసి కట్టుకుంది. అది మా పెళ్లిచీర. నిరుడు పెళ్లిరోజున మా ఆయన కొన్నారు.

'మంచి ఆకలేస్తోంది కమ్మగా వాసన వేస్తోంది, ఏం చేసావేంటి వంట?' అంటూ కంచం

ముందు కూర్చుంది.

అన్నీ వడ్డించాను. ఆవురావురు మంటూ భోంచేసింది. నేను మళ్లీ వండుకోవాలి.

చాప పరచుకుని పడుకుంది. మంచి నిద్ర పట్టినట్లుంది. నేను మళ్లీ వంట చేసుకుని భోజనం చేసాను. ఆవిడ వదిలిన చీర ఉతికి ఆరేసాను.

సాయంత్రం నిద్రలేచింది. ఈలోగా నేను బైటికి వెళ్లి పాలు తీసుకొచ్చాను. కాఫీ కలిపి యిచ్చాను.

'వంట బాగానే చేసావ్, ఇంత మంచి భోజనం చేసి చాలా రోజులైంది.' సర్టిఫికెట్ యిచ్చింది.

'ఎప్పుడొస్తాడు' అడిగింది ఆమె.

'ఏమో తెలీదు' అన్నాను. ఆమె అడిగింది మా ఆయన గురించే అని అర్థమైంది.

'నే వెళతాను' అంటూ బైల్దేరింది.

ఆమె చీర ఇంకా ఆరలేదు. కవర్లో పెట్టి యిచ్చాను.

'నీ చీర నే వెళ్లాకా పోస్టులో పంపుతాను' అంది ఆమె.

రాత్రి ఆయన యింటికి వచ్చారు.

'అదొచ్చిందా...?' వస్తూనే అడిగారు.

అదెవరో... ఉదయం వచ్చినావిడ గురించే అనుకుంటాను.

తలూపాను. ఆవిడ వచ్చినట్లు అప్పుడే ఈయనకి ఎలా తెలిసిందో నాకర్థం కాలేదు.

'దరిద్రగొట్టుది. వాళ్లింట్లో తప్పు బుట్టింది. అయినా దాన్ననకూడదు. ఆ భ్రష్టుణ్ణి అనాలి. అడ్డమైన కాంట్రాక్టుల కోసం పెళ్లాన్ని యిలా బంగళాకి పంపడం...' మధ్యలో ఆపేసారు.

నాకర్థం కాలేదు. అసలు నాకేదీ అంత తొందరగా అర్థం కాదు. ఈ భాగోతం ఏమిటో అసలు అర్థం కాలేదు.

భోజనం అయినాక అన్నారాయన 'నీకు చెప్పలేదు కదూ... అదీ... దాని పేరేంటో... పేరెందుకులే... మా బంధువులమ్మాయి. పెళ్ళి చేసారు. దాని ప్రారబ్ధం దాని మొగుడో కాంట్రాక్టరు. సంతకాల కోసం పెళ్లాన్ని కూడ తార్చుతాడు. ఆఫీసుకి వెళితే తెలిసింది. అది వచ్చినట్లు. మొదట్లో యిక్కడికొచ్చి ఏడిచేది. ఇప్పుడు అలవాటై పోయిందట. అదే చెప్పింది. సిగ్గులేకుండా. ఎప్పుడూ యింటికి రమ్మని నేను అడగ లేదు. అదీ వస్తానని అనలేదు. నేను లేకపోయే సరికి సరాసరి ఇల్లు కనుక్కుని యింటికే వచ్చేసింది. నువ్వు ఆతిథ్యం చేసి పంపావా...?' అడిగారు.

'మీ వాళ్లని చెప్తే....' ఆగాను నేను.

'నువ్వు మాత్రం ఏం చేస్తావ్....' సర్దుకున్నారు. ఆయన చిరాకు తగ్గింది.

ఆయన నిద్ర పోయారు. నాకు మాత్రం నిద్ర పట్టలేదు. ఇంటి కప్పు వేపు చూస్తూ ఆ రాత్రి గడిపాను.

ఎందుకిలా చేస్తారో మనుషులు- అర్థం కాలేదు. ఎంతకి దిగజారుతారో! కట్టుకున్న పెళ్లాన్నే... అంతా డబ్బుకోసం... అంతకన్న నా ఆలోచన ముందుకి సాగలేదు. అదే నా మనసు నిండా తిరుగుతోంది. రాత్రంతా అదే ఆలోచన.

ఆ మర్నాడు ఆ విషయం మర్చిపోయాను. వారం తరవాత పోస్టులో పార్శిల్ వచ్చింది. అది నా చీరే. దానికి ముందురోజు నాకో వుత్తరం వచ్చింది. అది విప్పి చదివాను.

'నా గురించి బుజ్జి ద్వారా నీకు తెలిసే వుంటుందనుకుంటాను. తెలుసుకుని నన్ను అసహ్యించుకున్నావా? ఎవరైనా అదే చేస్తారు. నేను కూడా ముందు యిష్టపడి ఒప్పుకోలేదు. మా యాయనతో దెబ్బలాడాను. పోట్లాడాను. చచ్చిపోవాలనుకున్నాను. విడిపోవాలని కూడా అనుకున్నాను. మా వాళ్లతో ఎలా చెప్పుకోవాలి. ఆయన చెప్పినట్లు చెయ్యక తప్ప లేదు. భోరున ఏడిచాను మొట్ట మొదటిసారి. ఎన్నో రాత్రులు నిద్రలేకుండా ఏడుస్తూ గడిపేసాను.


అలవాటైపోయింది. చాలాకాలం గుట్టుగానే సాగింది. ఇదుగో మీ ఆయన పనిచేస్తున్న కంపెనీలో కూడా మా ఆయనకి కాంట్రాక్టులున్నాయి. అప్పుడు తెలిసిపోయింది నా వాళ్లు అందరికీ నా గురించి. అందరూ నానామాటలన్నారు. ఇలా బతికేకన్నా యింత విషం తిని చచ్చిపోకూడదా అన్నారు నా కన్న వాళ్లు. అంతా వెలి వేసారు.

అదీ నాగురించి.... నీ చీర పంపుతున్నాను' అంటూ ముగించింది ఆ వుత్తరం. మర్నాడు పోస్టులో పార్శిల్ వచ్చింది. ఉత్తరం చదివిన రాత్రి చాలా ఆలోచించాను.

మర్నాడు పోస్టుమాన్ పార్శిల్ తీసుకువచ్చాడు. అందులో ఆమె కట్టుకున్న నా చీర వుందని తెలుసు. అది నేను మళ్లీ కట్టుకోలేను.

పార్శిల్ తిప్పి పంపేసాను.

*



చిరునామా:
ఏ.వి.శివప్రసాదరావు
సెక్టార్ -6, ఎం.ఐ.జి- ఐఐ/ 27,
ఎం.వి.పి. కాలనీ,
విశాఖపట్నం - 530 317
సెల్: 9393101132